

# భాగస్తుడు

సుబ్బరాజు పనిమీద పట్నం వచ్చాడు. వచ్చిన పని కాగానే తిరిగి స్వగ్రామానికి బయల్దేరు తుండగా అనుకోకుండా అతనికి చిన్ననాటి మిత్రుడు రంగరాజు కనిపించాడు. రంగరాజు సుబ్బరాజును పలకరించి అవీ ఇవీ మాట్లాడి తమ ఇంటికి రమ్మని ఆహ్వానించాడు.

పదేళ్ళ తర్వాత కనబడిన మిత్రుడి ఆహ్వానాన్ని కాదనలేక సుబ్బరాజు రంగరాజు ఇంటికి వెళ్ళాడు.

భోజనాలవీ అయిం తర్వాత ఇద్దరూ పిచ్చా పాటీ కబుర్లు చెప్పుకున్నారు. సుబ్బరాజు తాను వ్యవసాయం చేసుకుంటూ గ్రామంలోనే హాయిగా జీవిస్తున్నానని చెప్పాడు. రంగరాజు పట్నంలో తను చేస్తున్న వ్యాపారాన్ని గురించి చెబుతూ, తన మామగారు బ్రతికున్నంత వరకు తన పని బాగానే వున్నదనీ, ప్రస్తుతం బావమరిది ఆధ్వర్యంలో వ్యాపారం జరుగుతూ వుండటం వల్ల తన పరిస్థితి అంత బాగా లేదనీ చెప్పాడు.

అందుకు సుబ్బరాజు తన ఆలోచన చెప్పాడు. తనతో పాటు గ్రామం వచ్చి వ్యవసాయం చేసుకో మన్నాడు. కాని రంగరాజు తనకు వ్యాపారాను భవం వుండటం వల్ల వ్యాపారమే మేలనీ, తన ఉద్దేశంలో వ్యాపారమే లాభసాటి గనుక తను చేయబోయే క్రొత్త వ్యాపారంలో సుబ్బరాజును కూడా భాగస్తుడుగా చేరమన్నాడు. ఆ విధంగా చేయటం వల్ల ఇటు వ్యాపారంలోనూ, అటు వ్యవసాయంలోనూ రెండు విధాలుగా లాభాలు పొందవచ్చుని నచ్చజెప్పాడు.

సుబ్బరాజు సరేనని ఆ రాత్రి రంగరాజు ఇంట్లోనే గడిపి, నెలరోజుల తర్వాత డబ్బుతో వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు. రెండు నెలలైనా

సుబ్బరాజు రాకపోయేటప్పటికి రంగరాజే అతని కోసం గ్రామం వెళ్ళాడు. సుబ్బరాజు, "నీతో కలసి వ్యాపారం చేయటం నా కిష్టంలేదు," అని నిర్మొహమాటంగా చెప్పాడు.

"మరి మా ఇంటికి వచ్చినపుడు ఇష్టమేననీ, నెల తర్వాత డబ్బుతో వస్తాననీ ఎందుకు చెప్పావు?" అనడిగాడు రంగరాజు.

అందుకు సుబ్బరాజు నవ్వి, "మొదట్లో నీ బుద్ధి తెలియక సరేనన్నాను. తెలిసిన తర్వాత నీతో భాగస్తుడిగా చేరటమంత బుద్ధి తక్కువ మరొకటి లేదని మానుకున్నాను," అన్నాడు.

"నా బుద్ధి నువ్వేం తెలుసుకున్నావ్?" అనడిగాడు రంగరాజు.

అందుకు సుబ్బరాజు తన అభిప్రాయాన్ని వివరంగా చెప్పాడు "నేను పట్నం వచ్చిన నాటి రాత్రి మీ ఇంట్లో గడిపాను. నువ్వు నన్ను భాగస్తుడిగా చేరమన్నావు గనుక నీ నిజాయితీని పరీక్షించాలన్న ఆలోచన నాకు కలిగింది. నూరు వరహాల సంచిని మీ ఇంట్లో కావాలనే వదలి వచ్చాను. నువ్వు ఆ వరహాల సంచిని తెచ్చి నా కిస్తావని ఇన్నాళ్ళుగా ఎదురుచూశాను. నువ్వు రాలేదు. ఈరోజు వచ్చావు. అయినా ఆ వరహాల సంచి ప్రస్తావన నువ్వు తేలేదు. నేను మరచిపోయి వుంటాననుకుని దాన్ని నువ్వు కాజేశావు. నూరు వరహాలకే కక్కుర్తిపడి చిన్ననాటి స్నేహితుడ్నే మోసం చేసే నీలాంటి వాడితో పదివేల వరహాలు తెచ్చి భాగస్తుడిగా చేరి వ్యాపారం చేయాలనుకోవటం కొరివితో తల గోక్కోవటం కాదా?" అంటూ రంగరాజును దులిపేశాడు సుబ్బరాజు.

వంచిన తల ఎత్తకుండా రంగరాజు సరాసరి తన పట్నం ఇంటికి వచ్చి చేరాడు.

